జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 29-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 768 పేజీలు: 4 వెల : రూ.7

# పైసలివ్వనిదే.. ఫైలు కదలదు!



✳ కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు ✳ మధ్యవర్తులుగా డాక్యుమెంట్ రైటర్లు ✳ పెన్సిల్ కోడ్‌పై చర్చ ✳ వివాదాస్పద భూములకు సైతం రిజిస్ట్రేషన్లు ✳ గతంలో ఏసీబీ దాడులు జరిగినా.. మారని తీరు

పలాస, ఆగస్టు 28 (వార్త): కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డబ్బులు ఇవ్వనిదే ఫైలు ఒక్క అంగుళం కూడా కదలడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నపాటి రిజిస్ట్రేషన్ పనులకు సైతం అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. రియల్ ఎస్టేట్ లావాదేవీలు మందగించడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గినా.. ఒక్కో దస్తావేజుకు ఒక్కో రేటు చొప్పున వసూళ్లు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని దస్తావేజులపై పెన్సిల్‌తో రాసే ప్రత్యేక గుర్తులు, కోడ్‌ల ఆధారంగానే సంబంధిత అధికారులు సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఉద్యోగి లంచం మొత్తం చెప్పేందుకు క్యాలిక్యులేటర్‌లో అంకెలు చూపిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. మధ్యవర్తిగా డాక్యుమెంట్ రైటర్ ఉంటున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఒక్కో రేటు నిర్ణయించి, దస్తావేజుల సంఖ్య ఆధారంగా రోజువారీగా వసూళ్లు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలోనూ నిబంధనల ఉల్లంఘన జరుగుతోందనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పలాస పరిసరాల్లో విలువైన భూములు ఉండటంతో వివాదాలు, చిన్నపాటి లోపాలతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లను పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని పూర్తి చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇటీవల పలాసలోని కంబిరిగాం సమీపంలోని ప్రభుత్వ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చి స్లాట్ బుకింగ్, దరఖాస్తు రుసుము, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల చెల్లింపునకు అవకాశం కల్పించింది. అయినప్పటికీ డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయం లేకుండా పనులు సాగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ తనిఖీలు, కేసులు నమోదైన ఘటనలు ఉన్నప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదు.

## ఆరోపణల్లో వాస్తవం లేదు..

రిజిస్ట్రేషన్ కోసం వచ్చే దస్తావేజులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ శ్యామల తెలిపారు. దస్తావేజులపై పెన్సిల్ గీతలు లేదా ప్రత్యేక కోడ్‌లు ఉంటేనే సంతకాలు చేస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కార్యాలయంలో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆధారాలతో సమాచారం ఇస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సామాన్యుడిపై.. ధరాభారం





✳ మండుతున్న నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు ✳ ఆందోళనలో మధ్యతరగతి ప్రజలు ✳ ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

మందస, ఆగస్టు 28(వార్త): పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు సామాన్యుడి జేబుకు చిల్లులు పడుతునే ఉన్నాయి. మార్కెట్ లోకి అడుగుపెడితే చాలు కళ్లు తిరిగే పరిస్థితి నెలకొంది. పంచదార, వంటనూనె, పెట్రోల్, బియ్యం వంటి నిత్యవసర వస్తువుల ధరలు ఎప్పుడూ లేనంతగా అమాంతంగా పెరిగిపోవడంతో సామాన్యుడి జీవితం చిన్నాభిన్నమవుతోంది.

## ధరలు ఎలా పెరిగాయంటే...

గత ఏడాదితో పోలిస్తే బియ్యం హెచ్‌ఎంటీ/బీపీటీ సన్నబియ్యం కిలో రూ.45 నుండి రూ.65-70 (రూ.20-25 పెరుగుదల) సోనా మసూరి ప్రీమియం రూ.55 నుండి రూ.75-80, సాధారణ దొడ్డు బియ్యం రూ.38 నుండి రూ.52, పెట్రోల్/డీజిల్ ధరలను పరిశీలిస్తే.. లీటరు పెట్రోల్ రూ.100 నుండి రూ.115, డీజిల్ రూ.93 నుండి రూ.108 పెరిగింది.

## వంటనూనె.. అత్యంత భారం..

పామాయిల్ రూ.110-120 నుండి రూ.160, సన్ ఫ్లవర్ ఆయిల్ : రూ.130 నుండి రూ.190, వేరుశనగ నూనె రూ.180 నుండి రూ.230 వరకూ ఉంది. అంటే లీటర్‌కు రూ.60-70 పెరుగుదల ఉంది. ఇతర సరుకులైన పంచదార రూ.42 నుండి రూ.54, కందిపప్పు రూ.100 నుండి రూ.145, ఉల్లి కిలో రూ.20 నుండి రూ.45నెలకు పెరిగింది. ఈ లెక్కన నలుగురు సభ్యులున్న ఒక సామాన్య కుటుంబానికి నెలకు సరుకులకు గతంలో రూ.6,000 అయితే, ఇప్పుడు రూ.10,000 నుంచి రూ.11,000 అవుతోంది. అంటే నెలకు రూ.4,000 అదనపు భారం. సంపాదించేది రూపాయి.. ఖర్చు అయ్యేది రెండు రూపాయలు.. ఇదే నేటి సంసారపు లెక్కగా మారింది. జీతం వచ్చిన రోజే షావుకారు.. మరుసటి రోజు నుంచి అప్పులవాడు.. ఇదే మధ్యతరగతి బతుకు అనే ఆవేదన ప్రతి గడపలో వినిపిస్తోంది.

## ధరలు నియంత్రించండి

ధరలను నియంత్రించాలని మందస అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్ పట్నాయక్ అన్నారు. సామాన్యుడి జేబుకు చిల్లులు పడే విధంగా ధరలు ఆమంతం పెరిగిపోవడంతో సామాన్యుడి జీవితం చిన్నాభిన్నమవుతోంది. ప్రభుత్వం వెంటనే ధరలు నియంత్రించాలి. నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలి.

- ప్రభాకర్ పట్నాయక్,
మందస అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

# హైవేపై రోడ్డు ప్రమాదం

పలాస, ఆగస్టు 28 (వార్త): పలాస సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. మాకన్నపల్లి జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలాస మండలం మామిడిమెట్టకు చెందిన చెల్లూరు బైరాగి (60) అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై ఆయనతో పాటు ప్రయాణిస్తున్న భార్య దమయంతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆమెను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నీట్ పీజీ పరీక్షకు జిల్లాలో నాలుగు కేంద్రాలు

✳ పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ✳ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు ✳ అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు ✳ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, ఆగస్టు 28 (వార్త): నీట్ పీజీ-2026 పరీక్షలకు శ్రీకాకుళం జిల్లాలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ నెల 30న నీట్ పీజీ-2026 పరీక్షలు జరగనున్నాయన్నారు. గతంలో కేటాయించిన మూడు కేంద్రాలతో పాటు కొత్తగా టెక్కలిలోని ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌ను కూడా పరీక్షా కేంద్రంగా చేర్చడంతో జిల్లాలో మొత్తం కేంద్రాల సంఖ్య 4కు చేరిందని వెల్లడించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఎచ్చెర్ల మండలంలోని శ్రీ శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ చిలకపాలెం జంక్షన్, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బి.ఆర్. అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రక్కన, నరసన్నపేట లోని కోర్ టెక్నాలజీస్ మారుతీ నగర్-2 తో పాటు కొత్తగా టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కేంద్రాల పర్యవేక్షణకు శ్రీకాకుళం ఆర్డీవోతో పాటు టెక్కలి ఆర్డీవోను సూపర్‌వైజరీ అధికారిగా, టెక్కలి ఆర్ఎస్‌డీటీని నోడల్ అధికారిగా నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రతతో పాటు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షలకు పంపుతారని, అభ్యర్థుల ఈ విషయంలో సహకరించాలని కోరారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు నడుపుతామని, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సిబ్బందితో కూడిన ప్రథమ చికిత్స అంబులెన్స్ సదుపాయాలు కల్పించామని చెప్పారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# రత్తకన్న రైల్వేగేట్‌తో.. నరకయాతన!

## విద్యార్థుల ప్రతిభ గుర్తించడానికే పరీక్షలు



**మందస, ఆగస్టు 28(వార్త):** విద్యార్థుల్లోని ప్రతిభ గుర్తించడానికే పరీక్షలు నిర్వహిస్తామని మందస మండల విద్యాశాఖాధికారి మగ్రిపాటి లక్ష్మణరావు తెలిపారు. లింబిగాం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 5వ తరగతికి జరుగుతున్న శ్లాస్-2026 పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభా, సామర్థ్యాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ఉండాలన్నారు. పరీక్షల ద్వారా విద్యార్థులలో పోటీ తత్వం పెరుగుతుందన్నారు. వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. సీఆర్టీ సాలిన జానకిరామయ్య(ఫీల్డు ఇన్వెస్టిగేటర్)గా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సోదర భావానికి ప్రతీకగా రక్షాబంధన్



**మందస, ఆగస్టు 28(వార్త):** సోదర భావానికి ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని బ్రహ్మకుమారీలు అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వారు మందస తహసీల్దార్ బి.శ్రీహరి, ఎంపీడీఓ వై.వెంకటరమణ, పోలీసులు, విద్యుత్ శాఖ, ఉపాధిహామీ పథకం, అగ్నిమాపక కేంద్రం, ఇతర అధికారులు, సిబ్బందిలకు రాఖీలు కట్టి, నుదుట తిలకం దిద్దారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషిలోని అహంకారాన్ని, స్వార్థాన్ని విడనాడాలని కోరారు. పలు ఆధ్యాత్మిక విషయాలను వివరించారు. చెడు వ్యసనాలను, చెడు కర్మలను, బాధపెట్టే గుణాలు వీడాలన్నారు. పలాస ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయంనకు చెందిన బ్రహ్మకుమారీలు లోలాక్షి, చామంతి, బ్రహ్మకుమార్‌లు కైలాష్, ప్రకాశరావు, గున్నయ్య పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక కంటి పరీక్షలు



**కొత్తూరు, ఆగస్టు 28 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యార్థుల కంటి పరీక్షల్లో భాగంగా పారాపురం మోడల్ ప్రైమరీ స్కూల్, కలిగాం ప్రైమరీ స్కూల్, గూనభద్ర ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థులకు ప్రత్యేక నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కంటి సంబంధిత వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు అందించారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 8వరకు నిర్వహిస్తున్న జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నేత్రదానంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. నేత్రదానం, ఎవరు ఈ నేత్రదానానికి అర్హులు, ఎవరి నేత్రాలు సేకరించడానికి వీలవుతుంది, మరణించిన వ్యక్తి నుంచి ఎంత తక్కువ సమయంలోపు నేత్రాలు సేకరించాలనే విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు, నేత్రదానం ప్రాముఖ్యత, కంటి సంరక్షణ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విలాసవతి, ఎల్. రమణయ్య, చంద్రకాంత్, పి.స్వర్ణలత, సి.హెచ్.సురేష్‌బాబు, వైద్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీ నీలవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 30న మందసలో జనసేన ప్రత్యేక సమావేశం

జై జనసేన | జై జై జనసేన

### స్థానిక సంస్థల ఎన్నికలకి సమాలోచన

(మండల అధ్యక్షుడు అధ్యక్షతన,నియోజకవర్గం-జిల్లా స్థాయి నాయకులు సమక్షంలో)

తేది. 30.08.2026 (ఆదివారం) పంచాయతీ స్థాయి నాయకులతో ప్రతేక సమావేశం

వేదిక : జనసేన మండల పార్టీ తాత్కాలిక కార్యాలయం (గాయత్రి నగర్)

సమయం : సాయంత్రం 3:00 నుండి 7:00 వరకు



**మందస, ఆగస్టు 28(వార్త):** మందసలోని గాయత్రినగర్‌లో గల జనసేన మండల కార్యాలయంలో ఈ నెల 30న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుప్పాయి గోపాలరావు తెలిపారు. మందసలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సమాలోచన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గం, జిల్లాస్థాయి నాయకులు పాల్గొంటారన్నారు. సాయంత్రం 3గంటల నుంచి 7గంటల వరకు జరిగే ఈ సమావేశంలో ముఖ్యంగా జనసేనకు కేటాయించాల్సిన బలమైన స్థానాలు, పార్టీలో ఇప్పటి వరకు పార్టీకి చిత్తశుద్ధితో పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరిగేలా గుర్తింపు తదితర అంశాలు చర్చించనున్నామ న్నారు. కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపునకు జనసేన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం సమావేశంలో చర్చకు రానున్నాయన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

- ప్రజలకు నిత్యం తప్పని ఇబ్బందులు
- శుక్రవారం గంటపాటు ట్రాఫిక్ జాం
- రైల్వే అండర్ పాసేజ్, ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి తప్పని ఎదురుచూపులు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 28(వార్త):** రాష్ట్రానికి సింహద్వారం లాంటి సౌత్‌కోస్ట్ రైల్వే స్వాగత ద్వారం ఇచ్ఛాపురంలో అడుగుపెట్టగానే వెక్కిరించేది రత్తకన్న ఎల్ సీ గేటు. ఈ గేటు వద్ద ట్రాఫిక్ జామ్‌తో నిత్యం ప్రజలు నరకయాతన అను భవిస్తున్నారు. అటు అండర్ పాసేజీ లేక ఇటు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరగక ప్రజలు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు కోట్ల రూపా యల నిధులు అండర్ పాసేజీ నిర్మాణానికి మంజూరైనప్పటికీ పనులు చేపట్ట డంలో మోకాళ్లడ్డుతున్నారు. ఒకరిద్దరి స్వలాభం కోసం ఆంధ్ర, ఒడిస్సా రెండు రాష్ట్రాలకు చెందిన సుమారు 80 గ్రామాల ప్రజలు మున్సిపాలిటీకి చెందిన మూడు వార్డుల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్న చీమకుట్టినట్టు కూడా లేదు. ఇటీవలే ఇచ్ఛాపురంలో పర్యటించిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ రైల్వే ఫ్లైఓవర్ పై గాలి మాటలు నమ్మొద్దని ఆరు నూరైనా నిర్మించి తీరుతామని బల్ల గుద్ది మరి నొక్కి వక్కాణించారు. కానీ రెండు నెలలైనా పునాదిరాయి కూడా పడలేదు. శుక్రవారం రాఖీపౌర్ణమి సందర్భంగా ఒక్కసారిగా రైల్వే గేట్ పడడంతో రెండువైపులా రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్ప డింది. సినిమా హాల్, రెండు డిగ్రీ కాలేజీలు, రెండు జూని యర్ కాలేజీలు, 5 హైస్కూళ్లు ,10 వరకు ప్రభుత్వ పాఠశాలలు, కొలిగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇటుకలు బట్టీలు రైల్వే గేట్ అవతల వైపే ఉన్నాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఈస్ట్ కోస్ట్ నుంచి సౌత్ కోస్ట్‌కి మారి రెండు నెలలు సమయం పూర్తయినప్పటికీ టెండర్లు దాఖలై వాటి గడువు కాలం కూడా పూర్తయినప్ప టికీ ఇప్పటివరకు తట్టెడు మట్టి కూడా తీయలేదు. ఏదో బలమైన శక్తి అడ్డుతుందనే విమర్శలు ఇంకా అధికార పక్షాన్ని ఇరుకున పెడుతూనే ఉన్నాయి. మరో రెండు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికల్లో ఈ గేటు అంశం కీలకంగా మారనుంది. రత్తకన్న మూడు వార్డుల ప్రజలు ఓట్లు ఈ రైల్వే గేట్ పైన ఆధార పడి ఉన్నాయి. ఇటు ప్రతిపక్షం కూడా దీటుగా పోరాటం చేస్తూనే ఉంది. అయిన ప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో విమర్శకుల నోరు మూయించలేకపో తున్నారు. ఇప్పటికైనా అండర్ పాసేజ్ పనులు త్వరితగతిన ప్రారంభించాలని ప్రజల కోరుతున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో కూడా పరిసర గ్రామాల్లో ఉన్న ప్రజల తాలూకా తీర్పు ఈ గేటు పైన ఆధారపడి ఉంటుందనడంలో సందేహం లేదు.



## నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగు

- ప్రతీ ఒక్కరూ నేత్రదానం చేయాలి
- అవయవ దానంపై అపోహలు వద్దు
- ఆర్గాన్ డొనేషన్‌తో చిరంజీవులుగా ఉండొచ్చు
- సిరిపురం నేత్ర వైద్యాధికారి మండెల్లి లక్ష్మణరావు




**మందస, ఆగస్టు 28(వార్త):** నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగులు ప్రసాదించవచ్చని, ప్రతీ ఒక్కరూ నేత్రదానం చేయాలని నేత్ర వైద్యాధికారి మండెల్లి లక్ష్మణరావు అన్నారు. సిరిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పొత్తంగి-సిరిపురం, సంతతోటలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హించారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా ఈ కార్యక్ర మాలు నిర్వహించినట్టు చెప్పారు. పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నగిరి తారకేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేత్రదానంపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించుకోవాలన్నారు. నేత్రదానంతో అంధుల జీవితంలో వెలు గులు ప్రసాదించవచ్చన్నారు. అవయవదానంపై అపోహలు వద్దని, మరణానంత ్రరం అవయవ దానం చేయాలని కోరారు. నేత్ర వైద్యాధికారి మండెల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ గాయాలు కావడం, పోషకాహారం లోపం, రసాయన చర్యలతో నల్లగుడ్డు(కార్నియా) మచ్చ అవ్వడంతో దృష్టి పోగొట్టుకున్న వారికి నేత్రదానముతో దృష్టిని ప్రసాదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సంతతోట వద్ద శుక్రవారం జరిగే సంతలో నేత్రదా నంపై లక్ష్మణరావు ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రచారం నిర్వ హించారు. మరణానంతరం నేత్రదానం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు.

## శంకర్.. మతిభ్రమించే మాటలొద్దు

- స్థాయికి మించిన మాటలు తగదు
- అబద్ధాలకు హద్దులు ఉండాలి
- కొండాకు వైసీపీ నేతల హితవు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 28(వార్త):** రెడ్డిక సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి తన స్థాయికి మించి మాటలు మాట్లాడటం, డ్రమాటిక్‌గా ఎవరినో మెప్పించాలనే తాపత్రయం తప్పించి, సబ్జక్ట్ లేదని, జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేసే ముందు వాస్తవాలు అర్థం చేసుకుంటే మంచిదని, మతి భ్రమించే మాటలు మానుకోవాలని వైస్సార్సీపీ నాయకులు హితవు పలికారు. శుక్రవారం వారు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కరువుకు తోబుట్టువు చంద్రబాబే అని రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి తెలుసునని, గూగుల్‌లో కరువుకు పర్యాయపదం వెదికితే చంద్రబాబు అనే సమాధానం ఇస్తుందేమో నన్నారు. నూతిలో కప్ప మాదిరిగా మాట్లాడారే తప్ప , బయట ప్రపంచంలో ఏం జరుగుతుందని కాస్త తెలుసుకుని మాట్లాడాలన్నారు. ప్రపంచం మొత్తం కరోనా వస్తే కేవలం ఆంధ్రప్రదేశ్లోనే కరోనా వచ్చినట్లు మాట్లాడడం అజ్ఞానం బయట పెట్టుకోవటమే అన్నారు. కరోనా సమయంలో స్వయంగా దేశ ప్రధానమంత్రి అప్పటి ముఖ్యమంత్రిగా జగన్ కరోనా విపత్తును చక్కగా హ్యాండిల్ చేసారని చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకోండని, ఊరికే విషయ పరిజ్ఞానం లేకుండా యాస ప్రాస కోసం తాపత్రయపడే బదులు, ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా వెలగబెట్టాలని హితవు పలికారు. ప్రజలకు ఉపయోగ పడే పనులు చేయడానికి ప్రయత్నం చేయాలన్నారు. శంకర్ పొందిన కార్పొరేషన్ కూడా జగన్ ప్రభు త్వంలో ఏర్పాటు చేసినదేనని, దానికి కొనసాగింపుగా అవకాశం దక్కిందని గమనించగలరన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, ఆశి పురుషోత్తం రెడ్డి, దక్కత నూకయ్య రెడ్డి, నీలాపు సారథి రెడ్డి, కారింగి త్రినాథ్‌రెడ్డి, పిట్ట విశ్వనాథం రెడ్డి, జగదీష్ రెడ్డి, దుక్క ధనలక్ష్మి, మురపాల చంద్రయ్య, దల్లి రమేష్, చుక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.




## విత్తసఖిల ద్వారా ఎంటర్ ప్రైనర్ రుణాలు

- వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు



**మందస, ఆగస్టు 28(వార్త):** మహిళా సంఘాల్లో రుణాలు పొంది, ఆదాయా భివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సంఘ సభ్యులకు వారి జీవనోపాధులు మెరుగుపరుస్తూ, ఎంటర్ ప్రైనర్‌లుగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం అదనపు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు మందస వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. కుంటికోట పంచాయతీలో గల కమలాపురంలో శు క్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మహిళా సంఘాల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలకు సంబంధించిన సభ్యుల వ్యాపారాభివృద్ధి కోసం ప్రభుత్వం విత్తసఖిల ద్వారా సర్వే చేయాలని, గుర్తించిన లబ్ధిదారులు కు వారి వ్యాపారాభివృద్ధి కోసం అదనపు రుణ సౌకర్యం తక్కువ వడ్డీకి అందించే అవకాశం ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు విత్తసఖి గీతా రాణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు ముఖలింగం, బాలకృష్ణ, వీఓఏ గుంట చలపతి, స్వయంశక్తి సంఘాల ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు.



## స్వర్ణభారతిలో రాఖీ వేడుకలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 28(వార్త):** రాఖీ పౌర్ణమి సందర్భంగా ఇచ్ఛాపురంలోని స్వర్ణభారతి ఆవరణలో విద్యార్థినీలు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరా భావాన్ని తెలియపరిచారు. స్వర్ణభారతి చైర్మన్ చాట్ల. తులసీదాస్ రెడ్డికి విద్యార్థులు, టీచర్లు రాఖీ కట్టి ఘనంగా రాఖీ పౌర్ణమి నిర్వహించారు.

## బూర్జపాడులో ఇంటింటికీ తెలుగుదేశం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 28 (వార్త):** బూర్జపాడు పంచాయతీ డొంకూరులో శుక్రవారం ఇంటింటికి తెలుగుదేశం నిర్వహించారు. ఈ రెండేళ్లలో సంక్షేమ, అభివృద్ధి పనులు గూర్చి ఇంటింటికీ తిరిగి వివరించారు. సీసీ రోడ్లు, తల్లికి వందనం, రైతులకు అన్నదాత సుఖీభవ, డ్వాక్రా మహిళల రుణాల మంజూరు, మత్స్యకారభరోసా అమలుపై అవగాహన కల్పించారు. బూర్జపాడు-డొంకూరు మధ్య త్వరితగతిన 2 బ్రిడ్జి పనులు కూటమి హయాంలోనే జరుగుతున్న సంగతి గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ దున్న లోకేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు దున్న కాంతమ్మ, దున్న కుర్మారావు, గురుమూర్తి , దున్న రమేష్, డి.దేవేంద్ర, పి.గణపతి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# కిన్నెరవాడలో ఆధునిక సాగుపై అవగాహన

- ఆత్మ పథకం ఆధ్వర్యంలో రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ
- నానో డీఏపీ, డ్రోన్ల వినియోగం, ఎరువులు--నీటి యాజమాన్యంపై సూచనలు
- ఫార్మర్ ఐడీ, పంటల బీమా తప్పనిసరి
- వ్యవసాయ అధికారులు



**సారవకోట, ఆగస్టు 28 (వార్త):** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకంలో భాగంగా సారవకోట మండలం కిన్నెరవాడ రైతు సేవా కేంద్రంలో రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపుపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగం, నీటి సంరక్షణ తదితర అంశా లపై రైతులకు నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మ పథక సంచాలకులు కె.జగన్మోహనరావు మాట్లాడుతూ వరి పంటలో కాలి బాటలు ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్లో నానో డీఏపీ వినియోగంతో కలిగే లాభాలతో పాటు వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ద్వారా సమయం, శ్రమ తగ్గించుకోవచ్చని తెలిపారు. అవసరానికి మించి యూరియా వినియోగించడంతో నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, రైతులు సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. నరసన్నపేట సహాయ వ్యవసాయ సంచాల కులు ఎల్.వి.మధు మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వరి పంటలో ఎరువులను సరైన మోతాదులో, సరైన సమయంలో వినియోగించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల యాజమాన్య పద్ధతులను అనుసరించాలని రైతు లకు సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని, అలాగే ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో పంటల కొనుగోలు వంటి ప్రక్రియల్లో ఫార్మర్ ఐడీ కీలకంగా మారనున్న నేపథ్యంలో రైతులు ముందస్తుగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.పి.ఉదయ్‌బాబు రైతులకు పంటల సాగులో అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యంపై వివ రించారు. నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని అవసరమైన మేరకే పరిమితం చేయాలని, మోతాదుకు మించి వాటిని వినియోగించరాదని సూచించారు. శిక్షణ అనంతరం కార్యక్ర మంలో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వరి పొలాన్ని సందర్శించి పంటల ప్రస్తుత పరిస్థితి, యాజమాన్య పద్ధతులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై రైతులతో చర్చించి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో సారవకోట మండల వ్యవసాయ అధికారి కె. వెంకటరావు, వీఏఏలు వాన ప్రవీణ్, చల్ల జనార్దన్, మట్ట శాంతారావు, కొట్టి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఆత్మీయత..అభిమానం కలకాలం నిలవాలి



**సోంపేట, ఆగస్టు 28(వార్త):** రక్షాబంధన్ సాక్షిగా మన ఆత్మీయత, అభిమానం, సోదర భావం కలకాలం కొనసాగాలని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కంచిలి మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు పేర్కొన్నారు. ఆనందోత్సా హాల మధ్య శుక్రవారం జరిగిన రాఖీ పండుగను వారు ఎంతో ఆత్మీయంగా జరుపుకున్నారు. చైర్‌పర్సన్ విజ య.. కృష్ణారావుకు రాఖీ కట్టారు. కంచిలిలో కృష్ణారావు స్వగ్రహానికి వచ్చి జడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి సమక్షంలో జరిపిన రక్షాబంధనం అందరినీ ఆనందపరి చింది. సుఖ సంతోషాలకు, సోదర భావానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధనం ద్వారా సమాజానికి మరింత రక్ష కలుగుతుందన్నారు. ఉన్నతమైన లక్ష్యాలు, ఉత్తమ ఆశయాలు ప్రతి ఒక్కరికి తప్పకుండా సాధ్యం కావాలని ఆకాంక్షించారు.

## వాటర్ ట్యాంక్ శుభ్రం



**కొత్తూరు, ఆగస్టు 28 (వార్త):** ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నివగాం గ్రామంలో తాగునీటి వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. గ్రామ ప్రజలకు సరఫరా అవుతున్న పీడబ్ల్యూఎస్ మంచినీటి వాటర్ ట్యాంక్‌లో నాచు, మురికి పేరుకుపోయిన విషయం తెలుసుకున్న కొత్తూరు టీడీపీ మండల ఉపాధ్యక్షులు, నివగాం ఎంపీటీసీ ప్రతినిధి బిల్లింగి సంజీవరావు వెంటనే స్పందించారు. ప్రజలకు కలుషిత నీరు అందకుండా తక్షణ చర్యలు చేపట్టి, సిబ్బందిని ఏర్పాటు చేశారు. తన పర్యవేక్షణలో వాటర్ ట్యాంక్‌ను బ్లీచింగ్ పౌడర్‌తో పూర్తిగా శుభ్రం చేయించారు. ట్యాంక్‌లో పేరుకుపోయిన నాచు, మురికిని తొలగించి, పరిశుభ్రంగా కడిగిన అనంతరం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి తాగునీటి పరిశుభ్రత ఎంతో ముఖ్యమని అన్నారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, ప్రజలకు సురక్షిత మైన మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్యలు, పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రావణి, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీముఖలింగంలో నూతన వంటశాల

- శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీరాధా గోవిందస్వామి ఆలయంలో ప్రారంభం
- పలువురు దాతల సహకారంతో నిర్మాణం
- స్వామివారి భోగ ప్రసాదాల తయారీకి ఉపయోగించనున్నట్లు ఈవో వెల్లడి



**జలుమూరు, ఆగస్టు 28 (వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని శ్రీరాధా గోవిందస్వామి ఆలయంలో నూతన వంటశాలను శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం, స్వామివారికి నిత్య నైవేద్యాలు, భోగ ప్రసాదాల తయారీకి అను వుగా ఈ వంటశాలను నిర్మించారు. ఆలయ ఈవో కె.కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌తో కలిసి నూతన వంటశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో కె.కొండలరావు మాట్లాడుతూ నూతన వంటశాల నిర్మాణానికి పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థికంగా, ఇతర రూపాల్లో సహకారం అందించారని తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో దాతల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. వంటశాల నిర్మాణానికి సహకరించిన దాతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలి పారు. నూతనంగా నిర్మించిన వంటశాలను ప్రధానంగా శ్రీరాధా గోవింద స్వామివారి భోగం, నైవేద్యాలు, ప్రసాదాల తయారీకి వినియోగించనున్నట్లు వివ రించారు. పరిశుభ్రమైన వాతావరణంలో ఆలయ సంప్రదాయాలకు అనుగు ణంగా ప్రసాదాలను తయారు చేయడానికి ఈ వంటశాల ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శ్రీముఖలింగం ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆలయ వర్గాలు తెలిపాయి. నూతన వంటశాల అందుబాటులోకి రావడంపై భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# జలుమూరులో ఎస్‌ఎల్‌ఏఎస్ పరీక్షల తనిఖీ

- విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల అంచనాకు పరీక్షలు
- 5, 7, 9 తరగతుల విద్యార్థులకు రెండు కేంద్రాల్లో నిర్వహణ
- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈవోలు

**జలుమూరు, ఆగస్టు 28 (వార్త):** జలుమూరు మోడల్ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర స్థాయి అభ్యసన సాధన సర్వే (ఎస్‌ఎల్‌ఏఎస్) పరీక్షలను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అభ్యసనా స్థాయి, వివిధ అంశాలపై వారికున్న అవగాహన, నైపుణ్యాలను గుర్తించి విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచే లక్ష్యంతో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో 5వ, 7వ, 9వ తరగతుల విద్యార్థులకు రెండు కేంద్రాల్లో ఎస్‌ఎల్‌ఏఎస్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్షా విధానాన్ని ఎంఈ వోలు బమ్మిడి మాధవరావు, ఎంవీఆర్ఎస్ ప్రసాదరావు శుక్రవారం పరిశీ లించారు. ఈ సందర్భంగా వారు పరీక్షల నిర్వహణపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్ష లకు హాజరయ్యేలా చూడాలని, ప్రతి విద్యార్థి నైపుణ్య స్థాయిని సమర్థవంతంగా అంచనా వేసే విధంగా పరీక్షల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎస్‌ఎల్‌ఏఎస్ ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించడంతో పాటు బోధనలో మరింత మెరుగుదలకు అవసరమైన అంశాలను తెలుసుకునే అవకా శం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణను పర్యవే క్షించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.




# పాఠశాలల్లో అభ్యసనా సర్వే



**ఇచ్ఛాపురం, ఆగస్టు 28 (వార్త):** విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభ్యసనా సామర్థ్యం సర్వే 2026ను ఇచ్ఛాపురం మండలంలోని ఎంపిక చేసిన 16 పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సర్వేలో 5, 7,9వ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం వంటి ప్రధాన విషయాల్లో విద్యార్థుల తరగతి స్థాయి అభ్యసనా ఫలితాలు, కనీస అభ్యసనా సామర్థ్యాలు అంచనా వేశారు. సర్వేను నిర్ణీత మార్గదర్శకాల సమయపట్టిక ప్రకారం ప్రశాంతమైన, పారదర్శకమైన వాతావరణంలో నిర్వహించారు. సంబంధిత ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పరీక్షా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయులపై సమగ్ర సమాచారం లభించడంతో పాటు, విద్యార్థులు ఎదుర్కొంటున్న అభ్యసన లోపాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు అవసరమైన బోధనా-అభ్యసనా వ్యూహాలు, లక్ష్యిత విద్యా కార్యక్రమాలను రూపొందించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఫలితాలను వ్యక్తిగత విద్యార్థులు లేదా పాఠశాలల ర్యాంకింగ్ కోసం కాకుండా, రాష్ట్ర, జిల్లా స్థాయిలో విద్యా నాణ్యతను మెరుగుపరచడానికి ఉపయో గించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మండల విద్యాశాఖాధికారి -1 సూర్యా రావు లొద్దపుట్టి ఆదర్శ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. మండల విద్యా శాఖాధికారి-2 విశ్వనాథం.. స్వర్ణభారతి ప్రైవేట్ పాఠశాలను పరిశీలించారు . 5వ తరగతి -365, 7వ తరగతి -139, 9వ తరగతి-105 విద్యార్థులకు సర్వే జరిపారు. ఫీల్డ్‌లో 20 మంది పాల్గొన్నారు.

# పలాసలో రేపు వైఎస్సార్‌సీపీ కృతజ్ఞతా సమావేశం

## కష్టకాలంలో అండగా నిలిచిన క్యాడర్‌కు మాజీ మంత్రి సీదిరి ధన్యవాదాలు

**పలాస, ఆగస్టు 28(వార్త):** కష్టకాలంలో తనకు, తన కుటుంబానికి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, అను బంధ విభాగాల ప్రతినిధులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపేందుకు మాజీ మంత్రి, పలాస మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో శనివారం కృతజ్ఞతా సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పలాసలోని ప్రగతి భవన్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరగనుంది. బైక్ ప్రమాదం కేసును హత్య కేసుగా మార్చి తనను, తన కుమారుడిని అక్రమంగా అరెస్టు చేశారని సీదిరి కుటుంబం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అరెస్టు జరిగిన నాటి నుంచి బెయిల్‌పై విడుదలయ్యే వరకు పార్టీ క్యాడర్ కుటుంబానికి అండగా నిలిచిందని మాజీ మంత్రి తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నామన్నారు. సమావేశానికి పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగాల ప్రతినిధు లు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మీ అండే కొండంత బలమని ఆయన తెలిపారు.




## పలాసలో కామన్‌శాండ్‌బోవా పాము కలకలం



**పలాస, ఆగస్టు 28 (వార్త):** పలాస సమీపంలో అరుదైన 'కామన్ శాండ్ బోవా' పాము ప్రత్యక్షమై స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ఓ జీడి పరి శ్రమ సమీపంలో సుమారు నాలుగు అంగుళాల మందంతో, శరీరంపై మచ్చ లతో ఉన్న పామును స్థానికులు గుర్తించారు. దీంతో భయాందోళనకు గురై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న ఈస్ట్రన్ ఘాట్ వైల్డ్‌లైఫ్ సొసైటీకి చెందిన స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడి అక్కడికి చేరుకుని పామును పరిశీలించారు. ఇది విషపూరితం కాదని, సాధారణంగా ఇసుక తిన్నెలు, అటవీ ప్రాంతాల్లో సంచరిస్తుందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ జాతి పాములు అరుదుగా కనిపిస్తాయని వెల్లడించారు. ప్రమాదం ఉందని భావించినప్పుడు ఆత్మరక్షణ కోసం శరీరాన్ని చుట్టుకుని తలను తోక వద్ద దాచుకోవడం ఈ పాము ప్రత్యేకత అని వివరించారు. చిన్న చీమలు, కప్పలు, ఎలుకలను ఆహారంగా తీసుకుంటుందని, సాధారణంగా మనుషులకు ఎలాంటి హాని చేయదని తెలిపారు. అనంతరం పామును సురక్షితంగా పట్టుకున్న ఓంకార్ త్యాడి కోసంగిపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

## కుక్కల దాడిలో దూడ మృతి



**మందస, ఆగస్టు 28(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద గ్రామంలో కుక్కలు, నక్కల బెడద ఎక్కువైంది. మనుషులతో పాటు మూగజీవులపై కూడా దాడి చేస్తున్నాయి. పిన్నింటి జోగారావు అనే రైతుకు చెందిన ఆవుదూడపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఉద్దానం ప్రజలు తమ పెంపుడు జంతువులను ఎక్కువగా జీడి తోటల్లో నిర్మించిన పశువులశాలలో కడు తుంటారు. వీటిపై గతంలో గుర్తు తెలియని జంతువు దాడి చేసి.. చంపేయ్యడం ప్రారంభించింది. దీనిని పట్టుకోవడానికి అటవీశాఖాధికారులు శ్రమించారు. కానీ వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇటీవల కుక్కలు, నక్కలు కోళ్లు, మేకలు, గేదెదూడలు, ఆవుదూడలతో పాటు పెంపుడు జంతువులపై దాడి చేస్తున్నాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడుతున్న పెంపుడు జంతువులు మరణిస్తున్నాయి. వీటికి తోడు మనుషులపై కూడా దాడి చేస్తుండడంతో వారు తీవ్రంగా గాయపడుతున్నారు. ప్రస్తుతం తోటల్లో కడుతున్న మూగజీవులకు రక్షణ లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, రక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# స్థానిక ఎన్నికలకు జనసేన ప్రత్యేక కార్యాచరణ

**- గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పార్టీ బలోపేతంపై దృష్టి**

**- అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణుల సమన్వయంపై కమిటీ చర్చ**



**కొత్తూరు, ఆగస్టు 28 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మ కంగా తీసుకున్న జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో పార్టీ విధివిధానాలు, ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సమావేశం శుక్రవారం ప్రారంభమైంది. పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన సందేశాన్ని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కమిటీ సభ్యులకు వివరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పార్టీని బలోపేతం చేయడం, సమర్థులైన అభ్యర్థుల ఎంపిక, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులు సమష్టిగా, సమన్వయంతో పనిచేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంపై కమిటీ ప్రధానంగా దృష్టి సారించింది. ఈ సమావేశంలో ప్రత్యేక కమిటీ సభ్యుడు, సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ పాల్గొని పార్టీ ఎన్నికల వ్యూహం, స్థానిక పరిస్థితులు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల అభిప్రాయాలపై చర్చించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు, కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేసేందుకు అవసరమైన చర్యలను దశలవారీగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## 30న శ్రీ గురుకుల విద్యాలయం డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం




**పలాస, ఆగస్టు 28(వార్త):** తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించు కుని పలాసలో ఈ నెల 30న ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వా హకులు తెలిపారు. తెలుగు భాష గొప్పతనాన్ని, సాహిత్య వైభవాన్ని, మాతృభాష పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెప్పేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం శ్రీగురుకుల విద్యాలయం డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం చేస్తారని తెలిపారు. గణపతి రెసిడెన్సీ వెనుకవైపు, కనితి కేశవరావు ఆసుపత్రి/కావ్య నర్సింగ్ హోమ్ సమీపంలో కళాశాల ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు యువతలో మాతృభాషపై అభిమానం, ఆసక్తిని పెంచే దిశగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు భాషను కాపా డుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొంటూ, భాషాభిమానులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## బియ్యం దోపిడీని అరికట్టండి




**సోంపేట, ఆగస్టు 28 (వార్త):** రేషన్ డిపోలకు గోదాముల నుంచి ప్రతినెలా సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో జరుగుతున్న భారీ దోపిడీని ఇప్పటికైనా అరికట్టాలని సోంపేట మండల రేషన్ డీలర్లు తహసీల్దార్ బి.అప్పలస్వామికి విజ్ఞప్తి చేశారు. ప్రతి రేషన్ డిపో డీలర్ కు ప్రతి నెలా 100 కేజీల నుంచి 300 కిలోల వరకు బియ్యంలో తరుగు వస్తుందని డీలర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇటువంటి సమస్యతో సతమతమవుతున్నప్పటికీ చర్యలు లేకపోవడం బాధాకరమన్నారు. వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సోంపేట మండలం డీలర్లు తరఫున శుక్రవారం స్థానిక తహసీల్దారు బి.అప్పల స్వామికి అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ముక్తకంఠంతో కోరారు. తమ ఆవేదనను దయతో అర్థం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ బియ్యం బస్తాలు క్యూఆర్ స్కానింగ్, రూపాయి కమిషన్ తో రేషన్ డిపోల అద్దెలు భరించడం, కుటుంబాన్ని పోషించ డం వంటి విషయాలు గుర్చి తప్పనిసరిగా ఆలోచించాలని కోరారు. ఇప్పటికే అనేకమార్లు సమస్యలు విన్నవించామని, ఇప్పటికైనా పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.



## ఘనంగా లంగర్

**శ్రీకాకుళం, ఆగస్టు 28(వార్త):** ప్రపంచ శాంతి దూత, మహా ప్రవక్త హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి 1501వ జన్మదినాన్ని పురస్క రించుకుని శ్రీకాకుళంలోని చారిత్రక జామియా మసీదులో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జామియా మసీదు యూత్, ముస్లిం జమాత్ ఆధ్వ ర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మతగురువులు ఆధ్యా త్మిక ప్రసంగాలు నిర్వహించి ప్రవక్త బోధనలు, శాంతి, సోదరభావం, మానవ త్వం, ఐక్యత వంటి సందేశాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం జుమ్మా నమాజు పూర్తయిన తర్వాత జామియా మసీదు యూత్, ముస్లిం జమాత్ సభ్యుల ఆధ్వర్యంలో లంగర్ విందు ఏర్పాటు చేశారు. సుమారు 300 మంది ముస్లిం సోదరులు విందులో పాల్గొన్నారు. గత 15 ఏళ్లుగా జామియా మసీదు యూత్, ముస్లిం జమాత్ సభ్యులు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ సమా జంలో సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తున్నారని పలువురు అభినందించా రు. ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని నిర్వాహకులు తెలిపారు. సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు.





# కిన్నెరవాడలో ఆధ్యాత్మిక సత్సంగం

**- శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో భక్తుల సందడి**

**- రామాయణ, మహాభారత మహాకావ్యాల విశిష్టతపై ప్రవచనాలు**

**- భక్తి మార్గం, ధార్మిక విలువలపై ఆధ్యాత్మిక ప్రవక్తల సందేశం**

**సారవకోట, ఆగస్టు 28 (వార్త):** కిన్నెరవాడలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక సత్సంగ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనా లను ఆసక్తిగా ఆలకించారు. ఆధ్యాత్మిక ప్రవక్తలు సిద్ధయ్య స్వామి, దాసిరెడ్డి యోగేశ్వరరావు తదితరులు భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. హిందూ ధర్మం విశిష్టతను వివరిస్తూ రామాయణం, మహాభారతం వంటి మహాకావ్యాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ జీవనం, ధర్మబద్ధమైన పాలన, కుటుంబ విలువలు, కర్తవ్య నిర్వహణ వంటి అంశాలను తెలుసుకోవచ్చని వివరించారు. మహాభార తం మానవ జీవితంలో ధర్మం, న్యాయం, సత్యం, బాధ్యతల ప్రాధాన్యతను తెలియజేసే గొప్ప ఇతిహాసమని పేర్కొన్నారు. నేటి సమాజంలో ధార్మిక, నైతిక విలువలను కాపాడుకోవడంలో ఇటువంటి ఆధ్యాత్మిక సత్సంగాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రవక్తలు తెలిపారు. మహాకావ్యాల్లోని సారాంశాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వా హకులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కత్తిరివానిపేటలో ప్రజాదర్బార్

**- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచనలతో వినతుల స్వీకరణ**

**- ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న బగ్గు అర్చన**

**- ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ**



**పోలాకి, ఆగస్టు 28 (వార్త):** కత్తిరివానిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచనలు, ఆదేశాల మేరకు శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ప్రజాదర్బార్‌కు నాయకత్వం వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలతో ఆమె ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామా జిక, గ్రామీణ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఆమెకు అందజే శారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని పరిశీలించి, సమస్యల స్వభావాన్ని తెలుసుకుని సంబంధిత అంశాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్తామని బగ్గు అర్చన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల నుంచి అందిన వినతులపై అధికారులతో సమన్వయం చేసుకుని, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా ప్రజాదర్బార్ కార్యక్రమాలు ఉపయోగపడతాయని, ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని ఆమె సూచించారు. ప్రజల సమస్యలను సకా లంలో పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# నరసన్నపేటలో ఎస్ఎల్ఏఎస్ పరీక్షలు

**- నాలుగు పాఠశాలల్లో ౦ 200 మంది విద్యార్థుల పరీక్షలు**

**- 5, 7, 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహణ**

**- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు**

**నరసన్నపేట, ఆగస్టు 28 (వార్త):** నరసన్నపేట మండలంలో స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఎల్ఏఎస్) పరీక్షలను శనివారం నిర్వహించినట్లు ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడం, వివిధ తరగతులలో వారి విద్యా ప్రగతిని పరిశీలించడమే ఈ పరీక్షల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బొరిగివలస, దేశవానిపేట, వీఎన్‌పురం జడ్పీ పాఠశాలలతో పాటు మరో ప్రైవేటు పాఠశాలలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు ఎస్ఎల్ఏఎస్ పరీక్షలకు హాజరైనట్లు చెప్పారు. 5, 7, 9వ తరగతులకు చెందిన విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేసి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఎస్ఎల్ఏఎస్ పరీక్షల ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయి, ఆయా సబ్జెక్టులపై ఉన్న అవగాహనను అంచనా వేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు తీసు కునే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.



# నరసన్నపేటలో ఘనంగా రక్షాబంధన్

**- ఎస్సై గణేష్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్ సభ్యులు**

**- సోదరభావంతో ఐక్యంగా ఉండాలని సందేశం**

**- ప్రభుత్వ ఉద్యోగులందరికీ రాఖీలు కట్టనున్నట్లు వెల్లడి**

**నరసన్నపేట, ఆగస్టు 28 (వార్త):** నరసన్నపేటలో రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సభ్యులు నరసన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్సై గణేష్‌కు రాఖీ కట్టి రక్షాబంధన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ పండుగ సోదరసోదరీమణుల మధ్య అను బంధానికి, ప్రేమాభిమానాలకు ప్రతీక అని ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సభ్యులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా సోదరభావంతో మెలగాలని, పరస్పర ప్రేమాభిమానాలతో సమాజ హితానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ రాఖీలు కట్టి సోదర భావ సందేశాన్ని విస్తృతంగా చాటిచెప్పే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సిస్టర్స్ బీకే ఈశ్వరి, బీకే గాయత్రి తెలిపారు. సమాజంలో శాంతి, సామరస్యం, ఐక్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సభ్యులు బీకే ఈశ్వరి, పీకే గాయత్రి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



# ప్రకృతి ముందు మనిషి నిస్సహాయుడు

**పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్**



**పలాస, ఆగస్టు 28(వార్త):** ప్రకృతి ముందు మనిషి ఎంత చిన్నవాడో టిబెట్-నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ఘోర విపత్తు మరోసారి గుర్తు చేసిందని పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్(బాబా) అన్నారు. ప్రకృతి సృష్టించిన విధ్వం సం హృదయాన్ని కలచి వేస్తోందన్నారు. తన స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో పటిష్టంగా నిర్మించిన భవనాలు, రహదారులు, విద్యుత్ కేంద్రాలు, హోటళ్లు, నివాసాలు క్షణాల్లో ధ్వంసమయ్యా యని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల కష్టంతో నిర్మించు కున్న ఇళ్లు, గ్రామాలు ఆనవాళ్లు లేకుండా పోవడం విషాద కరమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా.. ప్రకృతి ఉగ్రరూపం ముందు మనిషి నిస్సహాయు డేనని ఈ ఘటన చాటిచెప్పిందన్నారు. ఆస్తులు కోల్పోయిన వారి బాధ ఒకవైపు కాగా.. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న విషాదం మరింత హృదయ విదారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు సంతోషంగా సాగిన జీవితాలు ఒక్క క్షణంలో విషాదంలోకి జారిపోయాయన్నారు. జీవితం శాశ్వతం కాదని, మనిషి శాశ్వతం కాదని.. మన చేతిలో ఉన్నది ప్రస్తుత క్షణం మాత్రమే నని తెలిపారు. స్వార్థం, ద్వేషం, అహంకారాలను విడనాడి తోటి మనుషులతో ప్రేమ, మానవత్వంతో జీవించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి ముందు మనిషి నిమిత్తమాత్రుడేననే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రకృతి విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తూ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



# తెలుగు భాషా పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటు పడాలి

**జి.సిగడాం, ఆగస్టు 28(వార్త):** తెలుగు భాషా పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని జి.సిగడాం ఏపీ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రిన్సిపాల్ గణేష్ పట్నాక్ అన్నారు.

శుక్రవారం పాఠశాల అవరణలో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గిడుగు వెంకటరామ్మూర్తి 163వ జయంతి వేడుకలు విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యావహారిక తెలుగు భాషోద్యమానికి విశేషకృషి చేసిన తెలుగు భాషోద్యమకర్త గిడుగు వెంకటరామమూర్తి సేవలు చిరస్మరణీయ మన్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చిన్నారులు తెలుగుతల్లి, ప్రాచీన తెలుగు కవులు, ఆధునిక రచయి త్రులు వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పద్యాలు, పాటలు, సూక్తులు, సామెతల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోట తిరుపతిరావు, ఎమ్.దుర్గారావు, బి. ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ

### - శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో ఘనంగా వేడుకలు



**పలాస, ఆగస్టు 28(వార్త):** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమాను రాగాలు, ఆత్మీయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను శ్రీ సత్యసాయి విద్యావిహార్, రామకృష్ణపురంలో శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సా హంగా పాల్గొని రాఖీ పండుగ విశిష్టతను చాటిచెప్పారు. విద్యార్థినులు తమ సోదర విద్యార్థులకు రాఖీలు కట్టి, వారి నుదుటన తిలకం దిద్ది, మిఠాయిలు అందించారు. సోదర విద్యార్థులు తమ సోదరీమణులపై ఆప్యాయత, గౌర వం, బాధ్యతతో మెలగాలని ప్రతిజ్ఞ చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి విద్యా విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్ల రామేశం మాట్లాడుతూ బంధాలను బలపరిచే పండుగ రాఖీ కేవలం ఒక పండుగ మాత్రమే కాదని.. కుటుంబ బంధాలు, పరస్పర విశ్వాసం, ఆప్యా యత, బాధ్యతల విలువను తెలియజేసే గొప్ప సాంస్కృతిక సంప్రదాయమని తెలిపారు. విద్యార్థి దశ నుంచే కుటుంబ విలువలు, సోదరభావం, పరస్పర గౌరవం వంటి లక్షణాలను అలవర్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యతో పాటు విలువలకు ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు నైతిక, సాంస్కృతిక విలువ లను పరిచయం చేయడంలో ముందంజలో ఉంటుందని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పండుగల వెనుక ఉన్న సామాజిక, సాంస్కృతిక సందేశాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా వివ రించడం ద్వారా వారిలో బాధ్యతాయుతమైన పౌరస్పృహను పెంపొందించవచ్చని చెప్పారు. రాఖీ వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రద ర్శించిన ఐక్యత, సోదరభావం అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల ఉపాధ్యా యులు విద్యార్థులను అభినందిస్తూ.. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం జీవితాంతం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు కిరణ్, దానేటి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో విఖనసనారాయణుల జయంతి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 28(వార్త):** వైదిక కార్యక్రమాలు, వేదమంత్రాలు, పూజా దిక విధానాలకు మూలమైన శ్రీమద్ విఖనస నారాయణుల జయంతి వేడుకలు ఇచ్ఛాపురంలో శాస్త్రోక్తంగా జరిగాయి. శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్క రించుకుని శుక్రవారం ఇచ్ఛాపురంలోని జగన్నాథస్వామి, కోదండరామస్వామి దేవాలయాల్లో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం విఖనస నారాయణుల ఆవిర్భావ స్తోత్రపఠనం, సుగంధ పుష్పాలు, తులసీదళాలతో సహస్రనామార్చన చేశారు. పూజా వేడుకలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. రక్షాబంధనాలు ధరించారు. అర్చక స్వాములు ఎస్.పద్మకుమార్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు అభిషేక ఘట్టా లను నిర్వహించారు. ప్రతి ఇంటా పూజామందిరంలో కొలువుతీర్చేందుకు శ్రీవిఖ నస నారాయణుల చిత్రపటాలను జగన్నాథస్వామి సేవాదళ ప్రతినిధి కాళ్ల శ్రీని వాసరావు, స్వప్న దంపతులు భక్తులకు వితరణ చేశారు. కోదండరామస్వామి దేవాలయంలో కొలువుతీరివున్న విఖనస నారాయణుల వారికి ధర్మకర్త పత్తి శ్రీలక్ష్మి' ఆధ్వర్యంలో పూజాదికాలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణను చేసి, స్వామివారిని కీర్తనలతో స్వరార్చన చేశారు. కాగా ఉదయం సామూహిక యజ్ఞోపవీత ధారణ జరిపారు.



## స్వేచ్ఛావతి ఆలయంలో

# శ్రావణ శుక్రవారం పూజలు

## మహాలక్ష్మి దేవికి విశేష అర్చనలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 28(వార్త):** జగన్నాథ స్వామి ఆలయంలో కొలువై ఉన్న మహాలక్ష్మిదేవికి శ్రావణ శుక్రవార పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యారాధన అనంతరం మూల విరాట్‌కు పాలు, పంచామృతాలు, గంగా జలం, ఫల రసాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్ర అలంకరణ అనంతరం పంచ వర్ణాలతో శోభిల్లే మందారం, మూడు రకాల చామంతులు, సంపెంగ పుష్పాలతోనూ, కుంకుమతో సహస్ర నామ అర్చనను అర్చకులు పద్మకుమార్ ఆచార్యులు జరిపారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణు, లక్ష్మీ, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ చేశారు. హారతి, మంత్ర పుష్పం, ప్రసాద వితరణ జరిగాయి. గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. సామూహిక లలిత సహార్చన నిర్వహించారు. డాక్టర్ వెచ్చ సంతోష్, నీలిమ దంపతులు పూజలో పాల్గొన్నారు.

## త్వరితగతిన రైల్వే బ్రిడ్జి పనులు చేపట్టండి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 28(వార్త):** రత్తకన్న ఎల్‌సీ గేటు వద్ద రైల్వే అండర్ పాసేజ్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియా రంగనాథ్ రెడ్డి రైల్వే అధికారులను కోరారు. ఈ మేరకు గత నెల 23న ఇచ్చిన వినతి మేరకు సౌత్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం డివిజన్ రైల్వే కమర్షియల్ అధికారులు లేఖ పంపారు. ఇప్పటికే జాయింట్ సర్వే, పరిశీలన కూడా పూర్తయిందని, డిజైన్‌లో కొన్ని మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. కాంట్రాక్టర్లతో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి టైం బాండ్ నిర్ణయించాలని, అప్రోచ్ రోడ్లకు సంబంధిత శాఖలతో సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. నిర్మాణం పూర్తయ్యే వరకు రైల్వే అధికారులతో నిత్యం సంప్రదింపులు చేస్తామని రంగా తెలిపారు.

## ప్రత్యేక రోజుల్లో

## మొక్కలు నాటడం ఎంతో మంచిది



**మందస, ఆగస్టు 28(వార్త):** ప్రత్యేక దినాల్లో మొక్కలు నాటడం ఎంతో మంచిదని ప్రధానోపాధ్యాయుడు కుత్తం ప్రకాశరావు అన్నారు. లొహరిబంద పంచాయతీలోని కొత్తపేట మోడల్ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ రక్షాబంధన్ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్నామన్నారు. పండగ, ప్రత్యేక రోజుల్లో ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పెంచి పెద్ద చేయాలని పిలుపునిచ్చారు. కాలుష్యం పెరిగిపోతోందని, ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు, అడవులు అంతరించిపోతుండడంతో వర్షాలు తగ్గి పోతున్నాయన్నారు. దీంతో గణనీయం పంటలు కూడా తగ్గిపోతున్నాయని, ఈ తరుణంలో ప్రజలు చైతన్యం కావాలని కోరారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దున్న రామారావు, సీహెచ్ సావిత్రి, షేక్ వజీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలాస ఐటీఐలో ఉచిత నైపుణ్య శిక్షణ

### అర్హులైన యువత నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**పలాస, ఆగస్టు 28 (వార్త):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో పలాసలోని డాక్టర్ వి.కణితి ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) కార్యక్రమం కింద ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సులను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఫీల్డ్ టెక్నీషియన్, కంప్యూటింగ్ అండ్ పెరిఫెరల్స్ అసిస్టెంట్, కన్‌స్ట్రక్షన్, ఫిట్టర్ విభాగాల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్ల వయస్సు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితం. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ అందించడంతోపాటు ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డాక్టర్ వి.కనితి ప్రభుత్వ ఐటీఐ, పలాస. స్కిల్ హబ్ కోఆర్డినేటర్: ఆర్. సోమేష్ సెల్ నెంబర్ 6301046329ను సంప్రదించాలని కోరారు.

## మొక్కలకు రాఖీలు..

# వృక్ష రక్షాబంధన్

**పలాస, ఆగస్టు 28(వార్త):** సోదర-సోదరీమణుల మధ్య అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్‌ను పురస్కరించుకుని మొక్కల సంరక్షణపై అవ గాహన కల్పించేందుకు వృక్ష రక్షాబంధన్ అనే వినూతమైన కార్యక్రమాన్ని నిర్వ హించారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శు క్రవారం జాతీయ హరిత దళం (ఎన్జీసీ) క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని మొక్కలకు రాఖీలు కట్టి, వాటిని తమ సోదరీమణుల్లా సంరక్షిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. 'వృక్షో రక్షతి రక్షితః' అనే నినాదంతో మొక్కల పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెప్పారు. పర్యావరణ పరిరక్షణపై విద్యా ర్థుల్లో బాధ్యతను పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని పలువురు వక్తలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.హేమారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బి.లక్ష్మీపతి, ఎన్జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్, సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, ఎన్.మంగరాజు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546